సాక్షి
చిత్తూరు
గురువారం । 28 । నవంబర్ । 2024



సైనికుల సేవలు వెలకట్టలేనివి

దేశం కోసం ఎనలేని సేవలందిస్తున్న సైనికుల సంక్షేమానికి మనవంతుగా సహకారం అందిద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. - 8లో



హైవేలో ఆయిల్ దొంగలు

పలమనేరు సమీపంలోని హైవేల్లో ఆపి ఉంచిన లారీల నుంచి రాత్రివేళ దొంగలు డీజిల్ కాజేస్తున్నారు. - 8లో



ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

పచ్చికాపల్లం గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయంలో నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

టీడీపీ, జనసేన నేతలు అవమానిస్తున్నారు



నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

పుంగనూరు: పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడిన తమను తెలుగుదేశం, జనసేన వారు అవమానిస్తుండడంతో పుంగనూరు నియోజకవర్గంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు బీజేపీ నాయకులు ఆ పార్టీ నేత, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఎదుట మొర పెట్టుకున్నారు. బుధవారం పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర ముక్తిమోర్చ కార్యదర్శి అయూబ్‌ఖాన్, బీజేపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలికిరిలో కిరణ్‌కుమార్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమిగా జతకట్టి అధికారాన్ని కైవసం చేసుకున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు అనంతరం కాలంలో బీజేపీ నాయకులను విస్మరిస్తోందని ఫిర్యాదు చేశారు. పుంగనూరులో అయితే ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. దీనిపై కిరణ్‌కుమార్‌రెడ్డి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సదరు బీజేపీ నేతలు తెలిపారు. నాయకులు నాగరాజు, అమర్, నారాయణ, రెడ్డెప్ప, రామకృష్ణ, డ్రైవర్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

3వేల అమెరికన్ డాలర్ల విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి బుధవారం ఓ దాత అమెరికన్ డాలర్లను గోసంరక్షణ ట్రస్టుకు విరాళంగా అందజేశారు. కొల్ల అజయ్‌కుమార్ అనే దాత 3వేల అమెరికలన్ డాలర్లను ట్రస్టుకు అందించారు. దీని విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం ఆయనకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

చిత్తూరు నగరానికి చెందిన లక్ష్మీ (పేరు మార్చాం) అనే మహిళ వారం రోజులకు కిందట చెస్ట్ భాగంలో కాస్త నొప్పిగా ఉందని అత్యవసర విభాగానికి చికిత్స నిమిత్తం వచ్చింది. అక్కడి సిబ్బంది డాక్టర్ల సూచనల మేరకు ఈసీజీ తీశారు. జెల్ లేని ఈసీజీ పరికరంతో కాసేపు కుస్తీ పట్టారు. నాలుగుసార్లు ఈసీజీ తీశారు. ఆ తర్వాత గుండె జబ్బు ఉందని చెప్పడంతో హడలిపోయిన లక్ష్మీ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి గుండె పరీక్ష చేసుకుంది. అక్కడి రిపోర్టులో ఎలాంటి సమస్యలు లేవని నిర్ధారణ కావడంతో ఊపిరి పీల్చుకుంది. ఈ కేసుకు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ వైద్యులు సిఫార్సు చేశారని తెలిసింది.




చిత్తూరు ప్రభుత్వాస్పత్రి అత్యవసర విభాగంలోని లోపలిభాగం (ఫైల్)

అంతటా నిర్లక్ష్యమే..

అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులు, ప్రజలు అత్యవసర విభాగం వద్ద అవస్థలకు గురవుతున్నారు. అక్కడ అడుగు పెడితే విభాగం గడప నుంచి అష్టకష్టాలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రధానంగా స్ట్రక్చర్లు కరువు. మంచం వరకు చేరితే డాక్టర్లు నాడీ పట్టే పరిస్థితుల్లో లేరు. కుర్చీలకే పరిమితమై వాళ్లు చెప్పిన వివరాల ఆధారంగా ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు పెడుతున్నారు. యూసీజీ తీసేందుకు జెల్ కరువుతోంది. ఆ జెల్ లేకుండానే యూసీజీ తీసి ఇచ్చేస్తుండడంతో అవి తప్పులు తడకగా ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ల్యాబ్ పరీక్షలకు కూడా బ్లడ్ సేకరించి ఇస్తే..బాధితులు లేదా వాళ్ల కుటుంబీకులు తీసుకెళ్లి ల్యాబ్‌లో ఇవ్వాల్సిన పరిస్థితి. మందులు, మాత్రలు, సెలైన్ బాటిళ్లు పెట్టించేందుకు సిబ్బందిని బతిమిలాడుకోవాలి. ఇక్కడ చాలా మంది విధులపై దృష్టి పెట్టకుండా ఫోన్లలో కాలక్షేపం చేస్తూ.. పేదల వైద్యానికి వెన్నుపోటు పొడుస్తున్నారు. మందులు, మాత్రలంతా బయటకు రాయిస్తున్నారు. వచ్చిన కేసులు చాలా వరకు తిరుపతి, తమిళనాడు, స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ అవుతున్నాయి. అధికారులు, అపోలో నిర్వాహకులు వచ్చినప్పుడు మాత్రం ఇక్కడి సేవలు హడావుడిగా కనిపిస్తుంటాయి. ఆ తర్వాత మాత్రం షరా మాములే అన్నట్లు ఉంటాయని ప్రజలు వాపోతున్నారు.

పేదలాస్పత్రికి జబ్బు!



పేదల ఆస్పత్రిగా పేరుగాంచిన జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి జబ్బు చేసింది. ఆస్పత్రి నిర్వహణ అపోలో సంస్థకు అప్పగించినా.. ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు. ఇటీవల కాలంలో ఆస్పత్రికి రావడానికే ప్రజలు జంకుతున్నారు. అత్యవసర సమయాల్లో సీనియర్ డాక్టర్ల సేవలు అందడం లేదు. ఏదైనా సర్జరీ చేయాలంటే సర్జన్లు కరువయ్యారు. రోగులకు ఏవైనా వైద్య పరీక్షలు చేస్తే రిపోర్టులు తప్పుల తడకగా వస్తున్నాయి. జబ్బు చేసిన జిల్లా ఆస్పత్రికి ప్రభుత్వ యంత్రాంగం సరైన వైద్యం అందిస్తే బాగుండని పలువురు రోగులు అభిప్రాయ పడుతున్నారు.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అందని అత్యవసర వైద్యసేవలు

- సర్జన్లు, సీనియర్ డాక్టర్లు కరువు
- నిర్లక్ష్యంగా వైద్యం చేస్తున్న వైనం
- హాహాకారాలు పెడుతున్న రోగులు
- అధికారులు, అపోలో సంస్థ నిర్వాహకులు వచ్చినప్పుడు మాత్రమే హడావుడి
- రోగుల గుండెల్లో గుబులు పుట్టించేలా తప్పుల తడకగా రిపోర్టులు
- కొన్ని సేవలకు యూజర్ చార్జీలు నిర్ణయించేలా అపోలో యాజమాన్యం
- సమ్మతించని జిల్లా కలెక్టర్
- చీకటి పడితే వైద్యం చేసే వారే ఉండరు

కాణిపాకం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని అత్యవసర విభాగం అభాసుపాలవుతోంది. సివిల్ సర్జన్లు, సీనియర్ డాక్టర్లు కరువుతున్నారు. వైద్య సేవల్లో పూర్తిగా నిర్లక్ష్యం దాపరిస్తోంది. రిపోర్టులు తప్పుల తడకగా ఇచ్చేస్తున్నారు. దీంతో రోగుల గుండె గుబేల్‌మంటోంది. చీకటి సేవల్లో కోతలు పడుతున్నాయి. రెఫర్ చేయడమే అత్యవసరానికి చికిత్సగా మలుచుకుంటున్నారు. దీంతో పాటు కొన్ని సేవలకు ఫీజు పెట్టాలనే విషయాన్ని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. యూజర్ చార్జీలకు కలెక్టర్ బ్రేకులు వేశారని ఆస్పత్రి వర్గాలు కోడైకూస్తున్నాయి.



అత్యవసర విభాగం

రాత్రిపూట కష్టమే..

రాత్రి పూట ఏ రోగమొచ్చినా పేదలకు పెద్ద ఆస్పత్రే దిక్కు. అలాంటి ఆస్పత్రిలో ప్రస్తుతం పగటి పూటే పేదల వైద్యానికి చీకటి పడిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాత్రి పూట ఆస్పత్రిలో వైద్య సేవల కోసం అల్లాడిపోతున్నారు. కడుపు నొప్పితో వచ్చినా తేలికగా రెఫర్ పెట్టేస్తున్నారు. డాక్టర్లు, సిబ్బంది కొంతమంది విధులకు రాత్రిపూట ఢుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో ఆస్పత్రి పూర్తిగా దారి తప్పిందనే వాదనలు వినిపిస్తున్నాయి. వైద్య సేవలు అందక ప్రజలు చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు.

ప్రతి రోజూ 200కి పైగా ఓపీలు..

చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అత్యవసర వైద్యం కోసం వందలాది మంది వస్తుంటారు. ప్రతిరోజు ఇక్కడకు 200పైగా ఓపీలొస్తుంటాయి. చుట్టుపక్కల 80 కి.మీల పరిధి వరకు ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా.. అత్యవసరమైనా జిల్లా ఆస్పత్రికే తీసుకొస్తుంటారు. అయితే ఇక్కడ సేవలు తూతుమంత్రంగానే ఉన్నాయని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

యూజర్ చార్జీలా..!

జిల్లా ఆస్పత్రిలో యూజర్ చార్జీలు పెట్టాలని అపోలో నిర్వాహకులు ఎప్పటి నుంచే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ విషయాన్ని ఇటీవల స్టేట్ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో అపోలో నిర్వాహకులు తెలియజేశారు. స్కానింగ్, ల్యాబ్, ఎమర్జెన్సీ తదితర వాటికి యూజర్ చార్జీలు పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. దీనిపై కలెక్టర్ అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. ''ఇది ప్రభుత్వ ఆస్పత్రి.. ఇక్కడ యూజర్ చార్జీలు పెడితే ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుంది'' అని చెప్పుకొచ్చినట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే ఆస్పత్రిలో నిర్లక్ష్య వైద్యం దాపురిస్తోందని జిల్లావాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యం అందించేలా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రెండు రోజుల్లో..

"యూజర్ పెట్టాలనేది తప్పుడు ప్రచారం. ఇది అవాస్తవం. అత్యవసర సేవల్లో మార్పులు తీసుకొచ్చాం. ఎక్కడా కానీ ఇబ్బంది లేదు. రాత్రి పూట కూడా అత్యవసర విభాగంతో పాటు ఆస్పత్రిని పరీక్షిస్తున్నాం. సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్పందిస్తున్నాం. ఇంకేవైనా సమస్యలు ఉంటే రెండు రోజుల్లో పరిష్కరించేలా చూస్తాం.

– నరేష్‌కుమార్‌రెడ్డి, అపోలో నిర్వాహకులు

ఉద్యోగుల ఆశలపై నీళ్లు

ఎన్నికలకు ముందు ఉద్యోగుల ఓట్ల కోసం కూటమి నేతలు అనేక హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమకు డీఏ, పీఆర్‌సీ, పీఎఫ్ బకాయిలు అన్ని వెంటనే మంజూరు చేస్తారని ఉద్యోగులు ఆశించారు. అయితే అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా అతీగతీ లేదు. ఇంతవరకు తమకు కూటమి ప్రభుత్వం ఏదో చేస్తుందని ఆశించిన ఉద్యోగులు.. చివరికి ఏమీ చేయదనే భావనకు వచ్చారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలని ఉద్యోగులు, సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

- రెండు జిల్లాల్లో బకాయిల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు 55 వేల మంది
- రావాల్సిన బకాయిలు సుమారు రూ.3 వేల కోట్లు
- డీఏ, పీఆర్‌సీ, పీఎఫ్ కోసం ఐదు నెలలుగా ప్రదక్షిణలు
- బడ్జెట్‌లో కేటాయింపులు లేవు.. కేబినెట్ మీట్‌లో చర్చ లేదని మండిపడుతున్న ఉద్యోగులు
- కూటమి సర్కారుపై లోలోన రగిలిపోతున్న వైనం



చిత్తూరు, తిరుపతి జిల్లాల సమాచారం

- చిత్తూరు జిల్లా టీచర్లు 8,728
- తిరుపతి జిల్లా టీచర్లు 7,254
- రెండు జిల్లాల్లోని ఇతర శాఖల ఉద్యోగులు 55 వేల మంది
- పీఎఫ్ బకాయిలు రూ.1,500 కోట్లు వరకు
- అన్ని రకాల బకాయిలు రూ.3 వేల కోట్లు వరకు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల ఆనందం ఆవిరైపోయింది. ఆర్థిక ప్రయోజనాలు ఒక్కటీ నెరవేరడం లేదు. చంద్రబాబుకు ఓటేస్తే అన్ని అందుతాయని ఆశ పడిన వారికి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతున్నా చిల్లిగవ్వ రాల్చలేదు. దీంతో కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు అమలు చేస్తుందా? అని ఉద్యోగులు డైలమాలో పడ్డారు.

పీఆర్‌సీ కమిషన్ ఊసేలేదు..

వాస్తవానికి 2023 జూలై నుంచి నూతన పీఆర్‌సీ కమిషన్ ఉద్యోగులకు వర్తించాల్సి ఉంది. గత ప్రభుత్వం వేసిన పీఆర్‌సీ కమిషన్‌కు గడువు ముగియడంతో పూర్తిగా రద్దయింది. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వాన్ని నూతన పీఆర్‌సీని ప్రకటించి ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. డీఏ, పీఆర్‌సీ, ఐఆర్ అన్ని ఇస్తారులే అని సంబరపడిన వారికి నిరాశే మిగులుతోంది. అయితే ఇంతవరకు అసలు పీఆర్‌సీ కమిషనే ఏర్పాటు చేయలేదని, ఐఆర్ ఊసే లేదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

తప్పని ఎదురుచూపులు..

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉద్యోగులకు అందాల్సిన పీఎఫ్ బకాయిలు కోట్లల్లోనే ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. ఉద్యోగులు తమ జీతం నుంచి దాచుకున్న పీఎఫ్ నుంచి రుణాల కోసం దాచుకున్న వారి సంఖ్య రెండు జిల్లాల్లో దాదాపు 10 వేల మంది పైనే ఉన్నారు. వారికి ఒక్కొక్కరికి వారి జీతాన్ని బట్టి దరఖాస్తు చేసుకున్న మొత్తం చూస్తే సరాసరి రూ.1,500 కోట్ల పైనే రావాల్సి ఉంటుందని అధికారిక అంచనా. వారితో పాటు ఉద్యోగ విరమణ చేసిన వారు మరో 800 మంది వరకు ఉన్నట్లు అంచనా. వీరు గత ఐదు నెలలుగా పీఎఫ్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రూ.3 వేల కోట్లకు పైనే బకాయిలు

చిత్తూరు జిల్లాలో 8,728 మంది, తిరుపతి జిల్లాలో 7,254 మంది మొత్తం రెండు జిల్లాల్లో 15,982 మంది టీచర్లు ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. వారితో పాటు ఇతర శాఖలకు చెందిన వారితో కలిపి మొత్తం రెండు జిల్లాల్లో 55 వేల మంది ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. రాష్ట్రం మొత్తం మీద ఉద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఆ ప్రకారం చిత్తూరు, తిరుపతి జిల్లాలకు కనీసం రూ.3 వేల కోట్లు వరకు రావాల్సి ఉంది. ఈ 5 నెలల పాలనా కాలంలో కూటమి సర్కారు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.


పలుమార్లు సీఎఫ్‌ఎంఎస్ వైపు..

బకాయిలు ఎప్పుడు విడుదల అవుతాయా ? అని ఉద్యోగులు సీఎఫ్‌ఎంఎస్ వెబ్‌సైట్‌లో చూసుకుంటున్నారు. పోనీ పీఆర్‌సీ బకాయిలైనా వస్తాయా..? అంటే ఎప్పుడో రిటైర్డ్ అయినప్పుడు ఉద్యోగ విరమణతో కలిపి ఇస్తారంట అని యూనియన్ నాయకులు చెబుతున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. చంద్రబాబు అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటుతున్నా ఇంతవరకు ఉద్యోగులకు చిల్లిగవ్వ విదిల్చింది లేదు. వచ్చే ఏడాది మార్చి వరకు ఎలాంటి బకాయిలు చెల్లించేది లేదని, ఇటీవల రహస్యంగా జీఓను కూడా విడుదల చేశారని ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు.

సరెండర్ లీవ్స్ సంగతి సరేసరి..

సరెండర్ సెలవుల బకాయిలు రావాల్సిన ఉద్యోగులు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సుమారు నాలుగు వేల మంది పైనే ఉన్నారు. వాటి ద్వారా రావాల్సిన బకాయిలు రూ.280 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. ఏపీ జీఎల్ఐ కాలపరిమితి పూర్తయి మెచ్యూరిటీ అయిన బకాయిలు రావాల్సిన ఉద్యోగులు మరో 500 మంది వరకు ఉన్నారు. వారికి మరో రూ.150 కోట్ల వరకు రావాల్సి ఉంది.

ఏ రకంగా చెల్లిస్తారో చెప్పాలి..



"బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు హామీ ఇచ్చింది. ఐదు నెలలు పూర్తవుతున్న నూతన ప్రభుత్వం ఇంత వరకు ఏ రకంగా బకాయిలు చెల్లిస్తారో చెప్పలేదు. క్యాబినెట్ సమావేశాల్లో చర్చలేదు. బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. రెండు డీఏలు ప్రకటించాల్సి ఉంది. – బాలాజీ, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వెంటనే విడుదల చేయాలి..



ఉద్యోగులకు అందాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి. బకాయిల చెల్లింపు పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి వహించాలి. పీఆర్‌సీ కమిషన్‌ను వేసి నివేదిక వచ్చే లోపు ఐఆర్ 30 శాతం ప్రకటించాలి. గతంలో పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను, పీఎఫ్ రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. – జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సంక్రాంతికైనా ప్రకటించాలి..



దసరా, దీపావళికి డీఏ ప్రకటిస్తారని ఆశించాం. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. సంక్రాంతికైనా డీఏ ప్రకటించాలి. ఉద్యోగుల సమస్యలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలి. ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు, సమస్యలను మా రాష్ట్ర నేతలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. – శివయ్య, ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, చిత్తూరు

పన్నుల వసూళ్లకు ప్రత్యేక ప్రణాళికలు



మాట్లాడుతున్న జాన్‌స్టీవెన్‌సన్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని, అలాగే బిల్లుల వసూళ్లకు ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని పని చేస్తున్నట్లు వాణిజ్య పన్నులశాఖ జేసీ (సంయుక్త కమిషనర్) జాన్‌స్టీవెన్‌సన్ తెలిపారు. బుధవారం పలు అంశాలపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఉన్నతాధికారులు పలు అంశాల గురించి చర్చించారన్నారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల సమస్యలను తెలపడానికి వాట్సాప్ నంబర్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. గతేడాది రూ.1,709 కోట్ల పన్నుల వసూలు లక్ష్యంగా నిర్దేశించగా రూ.1,318 కోట్లు వసూలు అయిందన్నారు. ఈ ఏడాది రూ.1,800 కోట్లు లక్ష్యంగా పెట్టగా రూ.870 కోట్లు అక్టోబర్ వరకు వచ్చిందన్నారు. జిల్లాలోని కొన్ని ప్రముఖ మొబైల్ సంస్థలు రూ.153 కోట్లు ఐటీసీ ఇక్కడ నుంచి క్లెయిమ్ చేసుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఆడిట్ ద్వారా రూ.2.5 కోట్లు, రిట్నర్స్ పరిశీలన ద్వారా రూ.3.6 కోట్లు, పాత బకాయిలు వసూలు ద్వారా రూ.8 కోట్లు, రిట్నర్స్ దాఖలాలు చేయని వారి వద్ద నుంచి రూ.6.8 కోట్లు, తనిఖీల ద్వారా రూ.2.14 కోట్లు వచ్చిందన్నారు. ఇవి కాకుండా ఐటీసీ రివర్సల్(4బీ1) ద్వారా రూ.258 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు.

కందకాలతో ఏనుగుల కట్టడి కష్టమే

పలమనేరు: ఏనుగులు అడవుల్లో నుంచి వచ్చి రైతుల పంటలను నాశనం చేయకుండా ఉండేందుకు అడవి అంచుల్లో కందకాలను తవ్వించనున్నట్లు ప్రభుత్వం తెలిపిందని, అయితే వీటితో ఏనుగులను కట్టడి చేయడం కష్టమేనని స్థానిక రైతుసంఘ నాయకుడు ఉమాపతి నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏనుగుల సమస్యపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయమేనని, అయితే ఈ కందకాలను ఉపాధి కూలీల ద్వారా చేయడం కష్టమేనని తెలిపారు. పది అడుగుల లోతు పది అడుగుల వెడల్పు కందకాలను కిలోమీటర్ల మేర కూలీల ద్వారా చేస్తే అది ఎప్పటికి పూర్తవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కౌండిన్యలో టీడీపీ హయాంలో జేసీబీలతో కాంట్రాక్టర్ల ద్వారా తవ్వించిన కందకాలను ఏనుగులు యథేచ్ఛగా పూడ్చివేసి నేరుగా పొలాల్లోకి వస్తున్నాయని తెలిపారు. కందకాల స్థానంలో బలమైన ఇనుప స్తంభాలను అమర్చి సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

స్కానింగ్‌తో భూరికార్డులు పదిలం



స్కానింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్



స్కానింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన యంత్రాలు

చిత్తూరు కలెక్టరేట్ : భూ రికార్డుల స్కానింగ్ ప్రక్రియపై కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ప్రత్యేక దృష్టి వహించారు. మండలాల్లో సైతం దొరకని కొన్ని భూముల రికార్డులు కలెక్టరేట్‌లోని రికార్డు రూములో అందుబాటులో ఉంటాయి. అయితే ఆ రికార్డుల భద్రత నేపథ్యంలో బుధవారం నుంచి స్కానింగ్ ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాల విభజన సమయంలో అన్నమయ్య, తిరుపతి జిల్లాల పరిధిలోకి వెళ్లిన ఆయా మండలాల రికార్డులను కలెక్టరేట్ నుంచి పంపించేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని 32 మండలాలకు చెందిన రికార్డులు మాత్రం కలెక్టరేట్‌లోని రికార్డు గదిలో ఉన్నాయి. అందులో ఫెయిర్ అడంగల్, ఏ రిజిస్టర్, ఇనాం రిజిస్టర్ రికార్డులను స్కానింగ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియను ఈసీఎం టెక్నాలజీ సంస్థకు అప్పగించారు. నెల రోజుల్లోపు రికార్డులను స్కానింగ్ చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ ప్రక్రియను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పర్యవేక్షించి పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

ఎస్టీలపై అగ్ర కులస్తుడు దాడి



ఎస్టీలపై దాడులు చేశారని వాపోతున్న ఎస్టీ కాలనీ వాసులు

పాలసముద్రం : వనదుర్గాపురంలో ఎస్టీ కాలనీకి చెందిన వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన అగ్రకులస్తుడు దాడి చేసినట్లు కాలనీ వాసులు తెలిపారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో వేసిన సిమెంట్ రోడ్డుపై చెప్పులు వేసుకుని నడచవద్దని, ట్యాంకు నుంచి నీళ్లు పట్టుకోకూడదని అగ్రకులస్తుడు చెప్పాడన్నారు. తాము చెప్పిన తరువాత కూడా సిమెంట్ రోడ్డుపై చెప్పులు వేసుకుని నడిస్తే కాళ్లు, చేతులు ఉండవని బెదిరించారన్నారు. అధికారులకు చెప్పినా కనీస స్పందన లేదని వాపోయారు. దీంతో అతను పదేపదే బెదిరిస్తున్నట్లు బాధితులు తెలిపారు. తాము ఎస్టీ కులంలో పుట్టడమే తప్పా..! ఇలా అయితే జీవనం ఎలా సాగించాలన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు స్పందించి తమపై దాడి చేసిన అధికార పార్టీకి చెందిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సైనికుల సేవలు వెలకట్టలేనివి

చిత్తూరు కలెక్టరేట్ : దేశరక్షణ కోసం సేవలందిస్తున్న సైనికుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. భారత సాయుధ దళాల పతాక దినోత్సవం పోస్టర్లను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయుధ దళాలు దేశ రక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఏటా డిసెంబర్ 7వ తేదీన భారత సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీర సైనికుల సంక్షేమం, వారి కుటుంబాలకు సాయం చేయడం మన కర్తవ్యమని, జిల్లాలోని ప్రతి ఒక్కరూ సాయుధ దళాల పతాక నిధికి తమవంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు, సిబ్బంది వినాయకరెడ్డి, సాయిప్రకాష్, మాజీ సైనికుల సంఘ నాయకులు సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షలకు ఎగ్జామినర్ల ఆలస్యం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న బీఎడ్ పరీక్షలకు ఎగ్జామినర్లు పదినిమిషాలు ఆలస్యంగా వస్తున్నారని కొందరు విద్యార్థులు వాట్సాప్ ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పరీక్ష సమయం 90 నిమిషాలు మాత్రమే ఉండగా అందులో పది నిమిషాలు అనవసరం వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ బాబును వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, ఇకపై తాను సైతం పర్యవేక్షిస్తానని తెలిపారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

పుంగనూరు: మండలంలోని పిచ్చిగుండ్లపల్లెకు చెందిన జయమ్మ (65) వ్యక్తిగత పని నిమిత్తం బుధవారం మిట్టపల్లె సచివాలయానికి వెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఉన్న వీధి కుక్కలు ఆమెపై ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో జయమ్మ తీవ్రంగా గాయపడగా స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్వార్థం అనే గునపాన్ని అక్రమార్కులు స్వర్ణమ్మ గుండెల్లో దింపుతున్నారు. కన్నీరింకిన స్వర్ణముఖి నదిలో ఇసుక యథేచ్ఛగా తోడేస్తున్నారు. నదిలో ఇసుకమేటలు మాయమై గోతులు కనిపిస్తున్నాయి. ఇబ్బడి ముబ్బడిగా ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు రూ.కోట్లు గడిస్తున్నారు. ఇందంతా రెవెన్యూ దృష్టికెళ్లినా నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా ప్రకృతి సంపద కరిగిపోతోంది.



కేశవ రెడ్డి స్కూల్ వెనుక వైపు స్వర్ణముఖి నదిలో పట్టపగలే హిటాచీతో ఇసుక తోడుతున్న దృశ్యం

స్వర్ణమ్మకు తూట్లు.. ఇసుకింకరులకు నోట్లు

- సీఎం చంద్రబాబు ఇలాఖాలో రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- పట్టపగలే హిటాచీతో స్వర్ణముఖి నదిలో తవ్వకాలు
- ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా తరలింపు
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- జిల్లా అధికారులైనా చర్యలు తీసుకోవాలంటున్న రైతులు
- ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామంటున్న అన్నదాతలు


సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నేతల ధనదాహానికి అంతులేకుండా పోతోంది. ప్రకృతి సంపదను యథేచ్ఛగా కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఓ వైపు నది పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం చర్యలు శూన్యం. సీఎం చంద్రబాబు నాయుడు సొంత మండలం చంద్రగిరిలో అధికార పార్టీ నేతల ఇసుక దోపిడీ తారాస్థాయికి చేరుకుంటోంది. ఏకంగా భారీ యంత్రాలతో స్వర్ణముఖి నదిని తోడేస్తూ, స్వర్ణమ్మకు తూట్లు పొడుస్తున్నారు.

సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తాం

స్వర్ణముఖి నదిలో భారీ యంత్రాలతో ఇసుకను తోడేయడంపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. సీఎం ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ ప్రకృతి సంపదను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించడంపై గురువారం నారావారిపల్లెకు సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో ఫిర్యాదు చేస్తామని రైతులు చెబుతున్నారు.

భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతుల ఆవేదన

స్వర్ణముఖినదిలో భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నరని నదీ పరివాహక ప్రాంతాల్లోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను తలపించేలా ఇసుకను తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి, వ్యవసాయ బోర్లు దెబ్బతినే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రాత్రింబవళ్లు అధికార పార్టీ నాయకులు ఇలా ఇతర జిల్లాలకు ఇసుకను రవాణా చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని మండిపడుతున్నారు.



నదిలో ఇసుకను తోడేయడంతో ఏర్పడిన పెద్ద పెద్ద గోతులు

పట్టపగలే హిటాచీతో ఇసుక తవ్వకాలు

మండలంలోని బుచ్చినాయుడుపల్లె పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖినదిలో గత కొద్ది రోజులుగా హిటాచీ యంత్రాలతో అధికార పార్టీకి చెందిన ఓ నేత ఇష్టారాజ్యంగా అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. గుట్ట గుట్టలుగా ఇసుకను పోగు చేసి, అక్కడ నుంచి పగలు ట్రాక్టర్లు, రాత్రి వేళల్లో టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. స్వర్ణముఖినదిలో సుమారు 15 అడుగుల లోతు వరకు హిటాచితో తవ్వకాలు జరపడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. స్వర్ణముఖినదిలో అక్రమ ఇసుక రవాణా ఆపాలంటూ గతంలో నిరసనలకు దిగిన టీడీపీ నేతలు ఇప్పుడు వారే ఇంతటి అవినీతికి పాల్పడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రెవెన్యూకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

గత రెండు రోజుల పాటు కేశవరెడ్డి స్కూల్ వెనుక వైపు భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారని ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమంగా హిటాచీతో ఇసుకను తోడేయడంతో ఘటనా స్థలానికి వెళ్లిన వీఆర్వోలు అధికార పార్టీకి చెందిన ఆ నేతతో మంతనాలు జరిపి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారుల కంటి ముందే హిటాచీ ఉన్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదని రైతులు మండిపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ఆ నేత మండలంలోని పలు శాఖలకు చెందిన కొంత మంది అధికారులకు నెల నెలా ముడుపులు ముట్టజెప్పడంతోనే తామేమీ ఎరగనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు పరోక్షంగా సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం సమీపంలోని పేట గ్రామం వద్ద ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు, బంగారం చోరీ చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామస్తుల కథనం మేరకు.. ముత్యాలమ్మ ఆలయంలోకి మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ముందు గేటు ద్వారా ప్రవేశించి ఆలయ ప్రధాన గేటుకు వేసిన తాళాలను పగులగొట్టి లోపలకు చొరబడ్డారు. ఆలయం లోపల ఉన్న బీరువాను ఇనుప రాడ్లతో ధ్వంసం చేసి, అందులోని రూ.5 వేలు నగదు, అమ్మవారి తాళిబొట్టుకు ఉన్న 3 గ్రాముల బంగారాన్ని దొంగలించుకుపోయినట్లు చెబుతున్నారు. వీటితో పాటు ఆలయంలో ఉన్న 2 కామాక్షి దీపపు స్తంభాలను సైతం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.



బీరువాను పగుల గొట్టిన దొంగలు

విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చోరీపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

ఆన్‌లైన్‌లో 'ఎన్‌ఎంఎంఎస్' హాల్ టికెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్) హాల్‌టికెట్‌లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ 8వ తేదీన www.bre.ap.gov.in వెబ్‌సైట్‌లోని స్కూల్ లాగిన్‌లో హాల్‌టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్ ఉపయోగించి హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.

పుత్తూరు విద్యార్థులకు రాష్ట్రస్థాయి పతకాలు

పుత్తూరు: తిరుపతిలో ఈనెల 26న జరిగిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్, కరాటే పోటీల్లో స్థానిక గేట్‌పుత్తూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు హెచ్ఎం కెజె వేములు తెలిపారు. బేస్‌బాల్ అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన సౌందర్య జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి జట్టు గోల్డ్ మెడల్ సాధించడంలో కీలకపాత్ర వహించిందన్నారు. అనంతపురంలో జరిగిన అండర్-17 కరాటే పోటీల్లో 62 కేజీల విభాగంలో భవ్యశ్రీ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పతకాలను సాధించిన విద్యార్థులను, తోడ్పడిన పీడీలు జయదేవ్, షమ్‌షుద్దీన్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొంగకు ఆరు నెలల జైలు శిక్ష

చిత్తూరు అర్బన్: స్కూటర్ చోరీ చేసిన కేసులో ఈశ్వర్ అనే నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం బుధవారం తీర్పునిచ్చింది. వివరాలు ఇలా.. బంగారుపాళ్యం మండలం బండ్లదొడ్డి గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి ఇంట్లో ఈ ఏడాది జూలై 12వ తేదీన బైక్ చోరీకి గురైంది. దగ్గువారిపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్ వాహనం చోరీ చేశాడని తెలుసుకున్న పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ మేరకు పూర్వాపరాలను పరిశీలించి నిందితుడికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 29,30 తేదీల్లో పోటీలు జరిపించనున్నట్లు వెల్లడించారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

రోల్ అబ్జర్వర్‌ను కలిసిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతిలో క్షేత్రస్థాయి పర్యటనకు విచ్చేసిన రోల్ అబ్జర్వర్ వినయ్‌చంద్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. చిత్తూరు జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక ముసాయిదా ఓటర్ల సవరణ కసరత్తును రోల్ అబ్జర్వర్‌కు వివరించారు.



వినయ్‌చంద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కన్నతల్లిపై కానిస్టేబుల్ దాడి

చిత్తూరు అర్బన్: కన్నతల్లిపై చేయి చేసుకున్న పోలీస్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు అయింది. చిత్తూరు టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. నగరంలోని రోసి నగర్‌కు చెందిన శంకర్ చిత్తూరు పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం తన తల్లి వసంతమ్మతో వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో శంకర్ ఆవేశంలో తన తల్లిని కొట్టడంతో ఆమె స్పృహ తప్పి కింద పడిపోయింది. స్థానికులు వసంతమ్మను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



చికిత్సపొందుతున్న వసంతమ్మ

హైవేలో ఆయిల్ దొంగలు

పొద్దస్తమానం లారీ నడిపి రాత్రిపూట హైవే పక్కన బండిని ఆపి విశ్రాంతి తీసుకుందామనుకునే డ్రైవర్లకు కొందరు దొంగలు నిద్ర లేకుండా చేస్తున్నారు అర్ధరాత్రి దాటాక లారీలోకి వెళ్లి ట్యాంకర్ వైర్ కట్ చేసి క్యాన్లలో డీజిల్ పట్టుకుని వెళ్లిపోతున్నారు. డ్రైవర్లు పొద్దున లేచి చూసేసరికి లారీలో డీజిల్ మాయమవుతోంది. జరిగిన విషయం యజమానులకు చెబితే వారు తిట్లదండకం అందుకుంటారు. అయితే కొందరు చేయి తిరిగిన ఆయిల్ దొంగలు హైవేల్లోని లారీలను టార్గెట్ చేసి డీజిల్ కాజేస్తున్నారు. ఇటీవల పలమనేరు సమీపంలోని నాగమంగళం వద్ద ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి.

రహదారుల పక్కన ఆపిన లారీల్లో అర్ధరాత్రి దాటాక డీజిల్ మాయం

- డ్రైవర్లు ఘాడనిద్రలోకి జారుకోగానే ఇంధనం కాజేస్తున్న దొంగలు
- పొద్దున లేచి చూసేసరికి డీజిల్ లేక డ్రైవర్ల ఇబ్బందులు
- యజమానులకు చెబితే తిట్లదండకం
- పలమనేరు సమీపంలోని నాగమంగళం వద్ద తరచూ వెలుగు చూస్తున్న ఘటనలు



పలమనేరు సమీపంలోని నాగమంగళం వద్ద రాత్రిపూట ఆపిన లారీలు

పలమనేరు: జాతీయ రహదారి పక్కన ఆపి ఉంచిన లారీల్లో నుంచి డీజిల్ మాయం అవుతోంది. అర్ధరాత్రి దాటిన తరువాత కొందరు ఆయిల్ దొంగలు ఈ పని పడుతున్నారు. చెన్నై-బెంగళూరు హైవేలో చిత్తూరు వైపు నుంచి వచ్చే లారీలు మధ్యలో ఆపుదామంటే మొగిలిఘాట్ ఉంది. అక్కడ ఏనుగుల సంచారం ఉండడంతో పట్టణ సమీపంలోని నాగమంగళం సేఫ్‌గా ఉంటుందని డ్రైవర్లు భావిస్తారు. అదేవిధంగా బెంగళూరు వైపు నుంచి వచ్చే లారీలు సైతం పత్తికొండ ఫారెస్ట్ దాటగానే సురక్షితమైన తావు ఇదే. దీనికితోడు ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా హోటళ్లు ఉంటాయి. లారీలను ఆపుకునేందుకు సైతం ఇక్కడ వెసులుబాటు ఉంటుంది. దీంతో గత కొన్నేళ్లుగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే డ్రైవర్లు రాత్రుల్లో లారీలను ఆపి అక్కడి హోటళ్లలో తిని లారీలో పడుకుని వేకువజామున వెళ్తుంటారు.

ఏమాత్రం అనుమానం రాకుండా..

ఈ హైవేలో నిత్యం 40 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇందులో 20 వేల దాకా లారీలే ఉంటాయి. ముఖ్యంగా రాత్రుల్లో లారీలు ఎక్కువ. ఇక్కడ వాహనాలను ఆపి, డ్రైవర్లు ఘాడ నిద్రలోకి జారుకుంటారు. ఇదే సమయంలో ఇక్కడే సంచరించే ఆయిల్ దొంగలు ఓ చోట ఆటో ఆపుకుని ఉంటారు. డ్రైవర్లు నిద్రలో ఉన్నట్లు నిర్ధారించుకుని, లారీ లోపలకు వెళ్లి ట్యాంకర్ నుంచి ఇంజిన్ ఉండే పైపును ఆక్సాబ్లేడ్‌తో కట్ చేసి తాము తెచ్చుకున్న క్యాన్లలోకి డీజిల్ నింపుకుని వెళ్తున్నట్టు బాధిత డ్రైవర్లు చెబుతున్నారు. ఆయిల్ ట్యాంకర్‌కు సేఫ్టీ కోసం లాక్‌లు ఉంటాయి. దీతో దొంగలు కింద ఉన్న పైపును కట్ చేస్తున్నారు. కొన్నిసార్లు ట్యాంకర్‌లో ఎక్కువగా డీజిల్ ఉంటే చోరులు తెచ్చుకున్న క్యాన్లు నిండగానే అలాగే వదిలేసి వెళ్తారు. దీంతో ట్యాంకులోని డీజిల్ రోడ్డుపై వృథాగా పోతోంది. సేకరించుకున్న డీజిల్ క్యాన్లను వారు తెచ్చుకున్న ఆటోలో వేసుకుని వెళ్లిపోతున్నారు. ఇలా రోజుకు వందలాది లీటర్ల డీజిల్ చోరీ తరచూ జరుగుతోందని డ్రైవర్లు చెబుతున్నారు. గతంలో బంగారుపాళెం ప్రాంతంలోని హైవేలో ఇలాంటి డీజిల్ చోరీలు ఎక్కువగా జరిగేవి. ఇప్పుడు దొంగలు నాగమంగళం వద్ద ఆపి ఉన్న లారీలను టార్గెట్ చేస్తున్నారు. హైవేలో పట్రోలింగ్ వాహనం వస్తున్నప్పటికీ అర్ధరాత్రి నుంచి మూడు గంటల ప్రాంతంలో ఎలాంటి పహారా ఉండదు. దీనికితోడు మంచి నిద్ర పొద్దు కావడంతో దొంగలు ఇదే సమయంలో చోరీలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. హైవే పోలీసులు నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

20 లీటర్ల సారా స్వాధీనం

పుంగనూరు: మండలంలోని పత్రపల్లెతండాలో సారా విక్రయిస్తున్న ఎం.చిన్నరెడ్డెప్ప నాయక్‌ను పట్టుకుని, అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి సీఐ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ సారా తయారు చేస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. అక్కడ సారా విక్రయిస్తున్న చిన్నరెడ్డెప్ప నాయక్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

1600 లీటర్ల సారా ఊట ధ్వంసం

పుంగనూరు మండలంలోని పెద్దతండా, పత్రపల్లి తండాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి 1600 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. బుధవారం ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జవహర్‌బాబు, ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీ కోసం నిల్వ చేసిన సారా ఊటను ధ్వంసం చేశారు.

10 లీటర్ల సారా స్వాధీనం

కార్వేటినగరం: అక్రమంగా ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్లు శ్రీరంగరాజపురం ఎస్ఐ సుమన్ తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిందితుల అరెస్టు చూపించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన పృథ్వీరాజ్, శేషాద్రి, యూఎం పురం గ్రామానికి చెందిన రామ్మూర్తి కలసి బైక్‌లో సారా తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు పుల్లూరు క్రాస్ వద్ద కాపు కాచి వారి బైక్‌ను ఆపి తనిఖీ చేయగా 10 లీటర్ల సారా పట్టుబడిందన్నారు. సారాతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



పత్రపల్లె తండాలో స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న సీఐ